

# నష్టపరిహారం

కప్పగంతుల మల్లికార్జునరావు

దరిద్రం జన్మహక్కుగా, పరువు ప్రతిష్ఠలు సంప్రదాయాలు, భుజకీర్తులు కిరీటాలుగా గల కుటుంబాలలో పుట్టింది సత్యవతి. కోరికల్ని కొద్ది కొద్దిగా కొరుక్కుతింటూ పెరిగింది.

వయస్సుకు పిచ్చి పట్టే రోజుల్లో ఆమెకు మిగిలిన వొకే వొక్క సింపుల్ కోరిక – తనూ తల్లి కావాలి!

తల్లి కావాలంటే పెళ్ళికావాలి కదా? పెళ్ళికావాలంటే డబ్బు వుండక తప్పదు కదా?

అంచేత ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా ఆమెకు పెళ్ళికాలేదు. పిల్లల్ని కనేటందుకు లైసెన్సు దొరకలేదు.

అప్పటికీ ఆ వొక్క కోరికను కూడా గొంతునులిమి చంపే ప్రయత్నం చేసిందామె. కానీ ఆ కోరిక మొండిది. చంపే ప్రయత్నం చేసేకొద్దీ సర్వాంతర్యామిలా ఆమె మనసును ఆక్రమించసాగింది.

ఆ స్థితిలో ఆమె వుండగా వెంకట్రావు ఆ గ్రామానికి వచ్చాడు. పక్క వూళ్ళో పెళ్ళిచూపులు చూడటానికి ఆ వూళ్ళో బంధువుల యింట్లో బసచేసేడు. యాదృచ్ఛికంగా సత్యవతిని చూచి ప్రేమించాడు. ఆమె వివరాలు తెలుసుకొన్నాడు.

వెంకట్రావు అక్కడెక్కడో టౌనులో వో ఫేక్టరీలో కార్మికుడు.

టౌనులో వో యిల్లువుంది. తల్లి వుంది. చదువు అంతగా లేకపోయినా సంస్కార ముంది.

'నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నానండీ. మీకు యిష్టమయితే పెళ్ళి చేసుకుంటాను. కట్నం గిట్నం అడగను. దాబుదర్జాలను ఆశించను.'

వంశ చరిత్రల దృష్ట్యా అవుతే వెంకట్రావు సత్యవతిని అలా అడగటానికి సాహసించేవాడు కాదు. కానీ అతని దృష్టిలో ధనవంతులదో కులం, ధన హీనులదో కులం. యీ రెండు కులాలకు చెందిన ఏ వంశచరిత్రలు చూసినా వొకటే ధోరణి కన్పిస్తుంది.

తన చిరకాలపు కోరిక తీర్చుకొనేటందుకు అది చివరి ఛాన్సులా గుర్తించింది సత్యవతి. కానీ పరువు ప్రతిష్టలు, సంప్రదాయాలు లాంటి ప్రతిబంధకాలు వున్నాయిగా ?

ధైర్యంచేసి తన కోరికను, వచ్చిన అవకాశాన్ని తలిదండ్రులకు వివరించింది.

వారు కూతురి ఆలోచనను విని అరిచి అల్లరిచేసుకోలేదు. ఏడ్చి, వున్న వొక్క స్థిరాస్తి అయిన కన్నీటిని ఖర్చు చేయలేదు.

'అమ్మా! డబ్బున్నవాళ్ళకే వంశ చరిత్రలు విలువైనవి. దరిద్రులకు అవన్నీ దర్పపోచతో సమానం. అల్లుడన్నట్లు యిప్పుడున్నది రెండు కులాల వారే. అతడెవరో మంచివాడులా వున్నాడు. నీ అదృష్టంకొద్దీ తటస్థపడ్డాడు. మా కోసం - మా కిరీటాల గౌరవం కోసం, మా భుజకీర్తుల తళుకుల కోసం - వచ్చిన అవకాశాన్ని జారవిడ్చుకోకు. అతడితో రహస్యంగా వెళ్ళి ఎక్కడో పెళ్ళి చేసుకో. పిల్లల్ని కని తల్లివై తృప్తిగా జీవించు యీ శృంఖలాలను తెంచుకొనే తెగింపు మాకెలాగూ లేదు. నువ్వన్నా ఆ పని చెయ్యమ్మా. భవిష్యత్తుకు మార్గదర్శకురాలివికా.'

అలా కూతుర్ని వెంకట్రావు కిచ్చి మనస్సులో పెళ్ళి చేసేరు. కన్నీళ్ళతో ఆశీర్వదించి రహస్యంగా అతడితో పంపేరు.

వెంకట్రావు సత్యవతిని పెళ్ళిచేసుకొన్నాడు. ఆమె చిరకాల వాంఛను తీర్చేడు. ఆనందస్వరూపాన్ని చూపేడు.

స్త్రీకి జన్మహక్కుగా, అతి సహజంగా, ఆనందంగా లభించాల్సిన మాతృత్వం సత్యవతికి అవిధంగా ఎన్నో ఆరాటాలు, పరీక్షల తర్వాత లభించింది. కొత్త జన్మనెత్తిన అనుభూతి కలిగిందామెకు।

అయితే ఆ అనుభూతి ఎంతో కాలం నిలవలేదు.

ఫేక్టరీలో జరిగిన ఏదో ప్రమాదంలో వెంకట్రావు చనిపోవటంతో సత్యవతి కథ మళ్ళీ కొత్తగా ఆరంభమయింది.

* * *

"సత్యా. సహజసిద్ధమైన కోరికల్ని

చంపుకొని పాతకాలపు పతివ్రతలా నటించకు. ఎవరైనా పెళ్లిచేసుకొంటా నంటూ నాలాగా ముందుకొస్తే కాదనకు. నీకు భర్త అవసరం - సుచరితకి తండ్రి అవసరం వున్నదని మర్చిపోకు" చని పోయేముందు వెంకట్రావు కొనవూపిరి నంతా కూడతీసుకొని సత్యవతికి చెప్పిన మాటలవి.

అయితే సత్యవతి ఆ మాటల్ని ఎప్పుడో బలవంతంగా చంపేసింది.

అత్తగారు - కూతురు - ఆమె రెండు కళ్ళు.

అత్తగారు వెంకటమ్మ సత్యకాలపు మనిషి. కోడలుగా వచ్చిన సత్యవతి వంశచరిత్రను యింకా పవిత్రంగా చూస్తూ గౌరవిస్తుంది.

'అమ్మా. గొప్పవంశంలో పుట్టినా వాడికోసం నీ వాళ్ళందర్నీ వదులుకొని వచ్చావు. వాడే పోయ్యాడు, యింకెందుకు యీ కులంతక్కువ యింట్లో వుండటం? పుట్టింటికి వెళ్ళరాదూ? నీ బిడ్డను పెద్ద కులందాన్నిగా పెంచుకోవచ్చుగా?'

అత్తగారిని ఎంత గౌరవించినా ఆమె యీ అభిప్రాయాల్ని ఎన్నడూ గౌరవించ లేదు సత్యవతి. పుట్టింటిని గురించిన ఆలోచనే చేయలేదు.

వెంకట్రావు చనిపోయేనాటికి కూతురు సుచరితకు మూడేళ్ళు. భార్య పోటో అచ్చుగుద్దినట్లుండే కూతురంటే అతనికి అమితప్రేమ.

'యిది అదృష్టవంతురాలు సత్యా. నీ అందం పొచ్చింది. గుణమూ వస్తుంది. కానీ అణిగిపడివుండే నీ తత్వం దీనికి అబ్బకూడదు. యిది అన్ని రంగాలలోనూ రాణించాలి. దీన్ని ఎలా పెంచి పెద్ద చేస్తానో చూడు."

భర్త ఎలా పెంచేవాడో సత్యవతికి తెల్సు. తనూ అలాగే పెంచాలని నిర్ణ యించుకొంది. సమస్త ఆలోచనలు, సర్వశక్తులను కూతురుపై కేంద్రీక రించింది. కూతురు చుట్టూ వో బంగారు కోటను కట్టుకొంది.

చదువు - డాన్సు - ఆట, పాట - సుచరితకు అయిదేళ్ళు వచ్చాయి. అన్నింటా ఎక్కొస్తోంది. ఆ యీడుకే 'చాకులాంటి పిల్ల'గా పేరుపొందింది. అందర్నీ ఆకర్షిస్తోంది.

సుచరిత అలా ఆకర్షించిన అనేకుల్లో ముఖ్యుడు శ్రీనివాసరావు.

శ్రీనివాసరావు ఆ వీధిలోని వాడే. సత్యవతికిలాగా వంశచరిత్ర, కులం, పరువు ప్రతిష్టలు యిత్యాది కలిగిన వాడు. అయితే వాటికి తోడు ధనంకూడా వుండటంతో వాటి అదృష్టం పండి రాణించేయి.

పైగా శ్రీనివాసరావుకు చదువుంది. మంచి వుద్యోగం వుంది. అందం యవ్వనాలు వున్నాయి. మంచి వాడు, కలిగలుపు తత్వం కలవాడు అన్న బిరుదులున్నాయి.

యిన్నివున్న పురుషుడికి వెల చాలా హెచ్చుకదా? అంచేత అతడివి అల్లుడిగా పొందటం కోసం కారుచక్రాలు అరిగిపోయేలా పెట్రోలు తగలేస్తున్నారు ధనవంతులు. విసిగిపోయిన కొందరు అతడి మీదికి సీమకుక్కల్లాంటి తమ కూతుళ్ళను వుసికొల్పి పంపేరు.

శ్రీనివాసరావు అందర్తో సర్దాగా మాట్లాడుతాడు, తిరుగుతాడు. ఎవర్నీ కాదని కష్టపెట్టడు. అలాగని ఎవర్నీ 'ఓకే' అనడు. ఫలితంగా కొడుకుపెళ్ళి తలిదండ్రులకి అంత డబ్బుండీ పెద్ద సమస్య అయింది.

'అందాన్ని అతిగా ప్రదర్శించుకొనే ఆడవాళ్ళంటే నాకు భయమండీ. భయపెట్టే ఆడదాన్ని పెళ్ళిచేసుకుని ఏం సుఖపడ్తాను? పైగా వీళ్ళంతా నిజంగా నన్ను ప్రేమించారా? నా సిరిసంపదల్ని, కులాన్ని, పరువుప్రతిష్టల్ని ప్రేమిస్తున్నారా అని అనుమానం? మా తాత పాపం భిక్షాటనం చేసుకొనే వాట్ట! నాన్న డబ్బు సంపాదించగానే ఆ చరిత్ర మర్చిపోయారంతా. రేపు పొరపాటున భిక్షపాత్ర నా చేతి కొచ్చిందనుకోండి. మా నాన్న కూడబెట్టిన చరిత్ర మాయమవుతుంది. అవునంటారా? కాదంటారా?'

వెంకట్రావు బ్రతికున్నప్పటి నుంచి శ్రీనివాసరావుకు ఆ యింటికి రావటం అలవాటే. యిలా సత్యవతితో ఏమేమో మాట్లాడటమూ అలవాటే. కానీ సత్యవతి వింటూందే కాని జవాబిచ్చే అలవాటు ఎన్నడూ లేదు.


'డబ్బుతో అన్నింటినీ కొనటం సాధ్యమంటారాండి? సాధ్యం కాదనటానికి వుదాహరణలు ఎన్నైనా చెప్పవచ్చు. అలాగే పోగొట్టుకొన్న ప్రతిదాన్ని డబ్బిచ్చి తిరిగి సంపాదించలేం. డబ్బున్నవాళ్ళకు ప్రేమ, వ్యక్తిత్వం యిత్యాది వాటి విలువలు తెలీవండీ—'

'నిజం శ్రీనివాసరావ్. నువ్వు రైటే నా భర్త ప్రమాదంలో చనిపోయినందుకు కంపెనీవారు కాంపెన్‌సేషన్ని ధనరూపంలో చెల్లించారు. కానీ రూపాయలు నా భర్తను నాకు తిరిగి యివ్వగలవా? ఆయన లేని లోటును తీర్చగలవా?'

సత్యవతి మనసులోనే అనుకొని కాస్సేపు ఏడ్చింది! భర్తతో గడిపిన సంసారజీవితం తాలూకు ఆనందపు స్మృతులు మనసు ఒడుగుపొరల నుంచి పైకి లేచివచ్చి ఆమెపైకి దాడిచేసేయి. అతి కష్టంమీద వాటిని ఓడించి జైల్లో పెట్టి బంధించ గలిగింది మళ్ళీ ఆమె!

* * *

'సుచీ. మా ఆఫీసులో యివాళ పెద్ద ఫంక్షన్ వుంది. నువ్వు పాటలు పాడుతావా? డేన్సు చేస్తావా! కల్చరల్ ప్రోగ్రాం నీదే.'



'బిస్కెట్లు చాక్లెట్లు తింటాను. అదే అసలైన కల్చరల్ ప్రోగ్రాం.'

'ఓసి నీ అసాధ్యం కూలా. చాలా పెద్ద సిద్ధాంతాన్ని ఒక్క చిన్న వాక్యంతో ఎగతాళిగా కొట్టిపారేసేవే!'

'ఏం సిద్ధాంతం? భోజన సిద్ధాంతమా?'

'అలాంటిదేలే కానీ–డేన్సు సంగతేం చేశావ్?'

'అమ్మ నడకుండా నేనేమన్నా చేస్తానా? నువ్వే చెప్పేవుగా? మాతృదేవోభవ.'

శ్రీనివాసరావు సత్యవతి దగ్గరి కెళ్ళాడు.

'సుచరితచేత యివాళ మా ఆఫీసులో డేన్సు చేయిద్దామని వుందండీ?'

సత్యవతి అతడి కోరిక వింది. అలవాటుగానే మాట్లాడలేదు.

'మిమ్మల్ని ఎప్పుడూ సమాధాన మివ్వమని వొత్తిడిచేయలేదు. కానీ, నా యీ కోరికను మీరు మన్నించాలి. అంగీకారం తెల్పాలి. తప్పదు!

'చిన్న పిల్ల అది. అప్పుడే అంత పెద్దదాన్ని ఎందుకు చేస్తారు? దాన్ని నేర్చుకోనీండి. ప్రోగ్రాంలిచ్చే సమయం వచ్చినప్పుడు ఆ ఏర్పాటు మీరే చేద్దురు గానిలెండి.'

'అదెలాగూ తప్పదు. కాని యిది అరంగేట్రం లాంటిది కాదు. సర్దాగా మా ఆఫీసులో యిచ్చే ప్రోగ్రాం. మా సుచీని మిత్రులందరికీ చూపించాలన్న వుబలాటం. మీరుకూడా రానక్కర్లేదు. నాతోపాటు తీసుకెళ్లి, మళ్లీ తీసుకొచ్చి మీ కూతుర్ని మీకు అప్పచెప్తాను-భద్రంగా.'

సుచరిత అంటే అభిమానం చూపే వ్యక్తి. ఎలా కాదనటం?

పాటకచేరీ, డాన్సుకచేరీ రెండూ చేసింది సుచరిత. ఆ యీడులో ఆ పిల్ల అభినివేశాన్ని అతిధులంతా పొగిడేరు. బహుమతులు యిచ్చారు.

'సుచీ యిందాకటిలాగా స్కూటర్ వెనకసీటులో కూర్చుంటావా? ముందు నిల్చుంటావా?

'వెనక కూర్చుంటా. ఏం? భయమా?'

'నిద్రపోకూడదు. నన్ను గట్టిగా పట్టుకోవాలి'

సుచరిత శ్రీనివాసరావును బల్లి కరుచుకొన్నట్లు కరుచుకొని కూర్చుంది.

శ్రీనివాసరావుకు పిల్లలంటే ప్రేమ. ప్రజ్ఞాప్రభవాలు గల పిల్లలంటే మరీ ప్రేమ!

"పరాయి పిల్లలమీద ప్రేమ లెందుకురా? పెళ్లిచేసుకుని హాయిగా పిల్లల్ని కని అడుకోరాదు?"

'పెళ్లి చేసుకోవచ్చు. పిల్లల్ని కనటమూ కష్టంకాదు. కానీ పుట్టేపిల్లలు సుచరితలాగా వుంటారని గ్యారంటీ ఏమిటీ?' పైకి అనడు మనసులో అనుకొంటాడు

విత్తుకొద్దీ చెట్టు-ఫలం!


తను చేసుచేసుకొనే భార్య, పంది పిల్లల్ని కన్నట్లు కనగానే సరికాదు. అన్ని విధాలా ఉత్తమమైన సంతానాన్ని కనాలి. అంటే తన భార్య ఉత్తమురాలు, సంస్కారి అయివుండాలి. ఎలా వీటిని స్త్రీలలో వెతికి పట్టుకోటం?

స్కూటర్ కన్నా శ్రీనివాసరావు మనసు వేగంగా పరుగెత్తుతోంది.

'అ... మ్మా....'

సుచరిత అర్తనాదం వినటానికి శ్రీనివాసరావుకు స్పృహలేదు.

స్పృహ తెలిసేక నెమ్మదిగా తెల్సిన వార్త-



ఆ ఏక్సిడెంటులో సుచరిత చని పోయింది!

సత్యవతికథ మళ్ళీ మొదటికొచ్చింది!

* * *

ఇంట్లోకి కాలుబెట్టటానికి శ్రీనివాస రావుకు ధైర్యం చాలలేదు.

సుచరితతో సహా ఆ యిల్లు వదిలి వెళ్లాడు ఆనాడు. యీనాడు వొంటరిగా వస్తున్నాడు.

'మళ్ళీ తీసుకొచ్చి మీ కూతుర్ని మీకు అప్పచెప్తాను-భద్రంగా'

తన మాటలే-మళ్ళీ మళ్ళీ వినిపిస్తు న్నాయి.

'నా కూతురేది?' అని అడిగే తల్లికి ఏం సమాధానమివ్వాలి? ఎంత ధనమిచ్చి, కనక వస్తువాహనాదుల్లో ఏదిచ్చి ఆమె లోటు తీర్చటం.

శోక దేవత వుంటుందో లేదో తెలియదు; కాంతివిహీనమైన వదనంతో కూర్చున్న సత్యవతిని చూచాక యిక శోకదేవతనూ చూడనక్కర్లేదు.

'మీ విలువైన వస్తువును అరువు తీసుకెళ్ళి పారేసుకొని రిక్తహస్తాలతో వచ్చాను. నాకు డబ్బుంది. డబ్బుతో కొన గలిగిన ఏ వస్తువునైనా మీ కివ్వగలను. జీవరహితమైన విలువైన వస్తువులను ఎన్నింటిని యిచ్చి, మీరు కోల్పోయిన విలువైన వస్తువుకు నష్టపరిహారం అనుకోమనను? ఏమిచ్చి మీ శోకం తీర్చ గలను?' సుచరితను తల్చుకొని ఏడవ సాగాడు శ్రీనివాసరావు.

'నా దురదృష్టానికి ఏడవాలి. మీరేం చేస్తారు? వూరుకోండి.'

సత్యవతి దుఃఖం కన్నీటి జల్లుతో

తీరేదికాదు. గుండెల్లోనుంచి మండేజ్వాల ఆమె శోకానికి అక్సిజన్!

బాబూ...!

చీకటిగదిలో దీపం వెలిగింది. సత్యవతి అత్తగారు సత్యకాలపు మనిషి. లోగిష్టి ముదుసలి.

'అమ్మాయి బ్రతికున్నప్పటినుంచి నిన్ను చూస్తున్నాను నాయనా. నువ్వు యోగ్యుడివి, మంచివాడివి నా కోడలు పోగొట్టుకొన్న దాన్ని యిస్తానంటూ అందుకే వచ్చావు ఆమె శోకాన్ని పోగొడ్తానంటున్నావు నీ కొక్కడికే అది సాధ్యం నాయనా.'

'ఏం?'

'ఆలోచించలేవూ?'

ఎంత ఆలోచించినా శ్రీనివాసరావుకు ఆమె భావం అర్థంకాలేదు

'ఏది నష్టపరిచేవో దానినే యిస్తే సరిపోలేదా నాయనా? మరో సుచరితను నా కోడలికి ఇవ్వరాదూ?'

కఠిన మనస్కుడు ఎంత సులభ పరిష్కారం?!

అర్థకామాలని ఐచ్ఛికంగా విసర్జించిన సత్యవతి స్త్రీసహజధర్మమైన మాతృత్వం కోసం సాంఘిక కట్టుబాట్లను కాలదన్నింది. ఆ మాతృత్వపు ఫలాన్ని తను నష్టపరిచాడు.

మరి ఆమె నష్టాన్ని పూడ్చటానికి తను కట్టుబాట్లను కాలదన్నటం ధర్మం కాదా? అవుతుంది.

అతను ఆమెవైపు వెలుగులో కొత్త దృష్టితో చూశాడు.

తనచుట్టూ యీగల గుంపులా ముసిరే ఆడపిల్లల్లో కనబడని ఏదో సొగసు, ప్రత్యేకత ఆమెలో కన్పించింది.

అర్థంకోసం ఆరాటంలేని వ్యక్తి! కామవర్జిత. ధర్మనిబద్ధురాలు.

అలాంటి స్త్రీ కోసమే కదా తన అన్వేషణ?

'సత్యా! మీ అత్తగారు చెప్పింది విన్నావుగా? నీ నష్టాన్ని నేను భర్తీ చేస్తాను. నిన్ను మాతృమూర్తిని చేస్తాను. పెళ్ళిచేసుకొని మరో సుచరిత నిస్తాను. ఏమంటావ్?' అపరయోగినిలా వున్న సత్యవతిని బుజాలుపట్టుకొని అడిగాడతను.

ఆమె మాట్లాడలేదు.

అయితే మండుతున్న ఆమె శరీరం తన స్పర్శానంతరం క్రమంగా చల్లబడటం గమనించాడతను. ఆమె సమాధానాన్ని ఆశించలేదు.

దగ్గరకు తీసుకొని ప్రేమగా లాలించాడు.